దేవాలయ స్తంభము

చింతా దీక్షితులు

౧

ఒకమహాపట్టణమున్నది. అది ఒక మహానదితీరాన్న ఉన్నది. ఆనదిపేరుచెప్పినప్పుడు ఆపట్టణమూ, ఆపట్టణముపేరు చెప్పినప్పుడానదీ స్మృతిపథమునకు దుముకుతవి.

ఎన్నివేల సంవత్సరములు కడచిననూ ఆపట్టణము శిథిలముకాలేదు. కారణము ఆనది. ప్రాచీన నాగరీకమును, ప్రాచీన విద్యావాసనలను, ప్రాచీనప్రజల హృదయౌన్నత్యమును ఆపట్టణమూ, ఆనదీ తమహృదయాలలో దాచుకొని మనుష్యపరిశోధనలను వ్యర్థముచేస్తున్నవి.

వాయు వానదీశీకరములను అప్పుడప్పుడు పట్టణముపై చల్లి దానిని పవిత్రముచేస్తూ ఉంటుంది.

ఆపట్టణములో ఒకజైలు ఉన్నది. అది పెద్దజైలు. ఈనాటి పాలకులు శిక్షితులకొరకేర్పరచిన కారాగార మది. భయపిశాచము కౌగిలిలో ఒదిగిఉంటూ రాజైలులోని శిక్షితులెప్పుడున్నూ. కన్నీటి బిందువులు, నిట్టూర్పులు, క్రోధప్రలాపములు, ఆయాసములు, విఫలీకృతమనోరథములు, ఈర్ష్యలు—ఆ నేరస్థుల సహచరులు.

ఆజైలు కొక సింహద్వార మున్నది—సింహమునకు నోరున్నట్లు. అది అందముగా ఉన్నది. సౌందర్యదేవత మంచినే ఆశ్రయించదు. అహింసనే ఆశ్రయించదు. సత్యమునే ఆశ్రయించదు. ధనధాన్యములనే ఆశ్రయించదు. భోగభాగ్యములనే ఆశ్రయించదు. సౌందర్యదేవతకు సమత్వభావమున్నది — అద్వైతికివలెనే. కారుమేఘములో మెరుపు అందముగా ఉన్నది- పిడుగులు పడద్రోయుచున్నది. వెలయాలి ముఖసౌందర్యము నరకమునకు సోపానములు కట్టుచున్నది. ఈసౌందర్యము బీదల దేహముల నప్పుడప్పుడాశ్రయించి వారి చిరుగుబట్టలలోనుంచి తొంగిచూస్తూంటుంది.

జైలుయొక్క అందమైన ముఖద్వారమును ప్రవేశించిన శిక్షితులు దాని దుఃఖజఠరమును ప్రవేశిస్తున్నారు.

జైలుద్వారమునకెదురుగా కొన్నిగజాల దూరమున బాట కిరుప్రక్కలా రెండు దేవాలయ స్తంభము లున్నవి. అవి జైలుకు దారి చూపుతున్నవి. అవీ అందమైనవే. ఎప్పుడో ప్రాచీనకాలమునాటి ఆరితేరిన శిల్పి హస్తనైపుణికవి నేడు దృష్టాంతముగా నున్నవి.

ఒకకాలమున భగవద్దర్శనమున కాత్రపడే భక్తులకు గర్భాలయమును చూపించిన ఆదేవాలయ స్తంభములు నేడు జైలుకు దారి చూపుతున్నవి.

"ఎంతటి తారుమారు" అనుకొంటాము మనము.

౨

ప్రాచీనకాలము. మహావైభవముతో బ్రహ్మోత్సవము జరుగుతున్నది. ఆవేశపరవశులైన భక్తులు భగవంతునకు ప్రదక్షిణము చేస్తున్నారు. భగవంతునకు ప్రదక్షిణ మన్నప్పుడు ఒక్క భగవంతునకే కాదు. మంటపమునకు, గర్భాలయమునకు, గోపురములకు, దేవాలయస్తంభములకు, భగవంతునకు— అందరికిన్నీ ఈప్రదక్షిణము. ఏభక్తిభావము, ఆవేశము, శరణాగతి ఈ ప్రదక్షిణమునకు కారణములో అవి భగవంతునకు చెందినట్లే తదాశ్రితులగు మంటపములకు, స్తంభములకు,గోపురములకుకూడా చెందుతున్నవి. ఆదేవాలయస్తంభములు ఈ ప్రదక్షిణలభావమును తమలో జీర్ణముచేసుకొన్నవి. బ్రహ్మోత్సవమునాటి ఆరతుల సువాసనలను, వాటితో మిళితమై భగవంతుని పాదముల జేరే భక్తుల ఆత్మసమర్పణభావమున్నూ ఆ దేవాలయస్తంభములు తమలో లీనముచేసుకొన్నవి. తూర్యాదివాద్యఘోషలు, ఘంటానాదములు, జయజయధ్వానములు, వేదఘోషలు, నామసంకీర్తనములు భగవంతుని చెవులబడుటకుముందు ఆ దేవాలయస్తంభములను రాచుకొనిపోయేవి. యోగవిద్యాసాధకు లాదేవాలయ స్తంభముల నానుకొని ధ్యానములో మునిగిపోయేవారు. అప్పుడా దేవాలయ స్తంభములున్నూ సమాధిస్థితిలో మునిగేవి. శరణాగతులైన భక్తుల హృదయములలో ఇష్టదైవతము ప్రవేశించుటవలన కలిగిన కన్నీళ్లు ఆ దేవాలయ స్తంభములపై కెక్కేవి. అవిన్నీ కన్నీళ్లు విడుస్తున్నట్లు ఉండేది. పసుపుతో, కుంకుమతో, చందనముతో, గంధముతో, కస్తూరితో, చమురుతో, కర్పూరవాసనలతో ఆగుటిగోడలతో పాటు ఆ దేవాలయస్తంభములున్నూ నిండి ఉండేవి.

ఆ దేవాలయస్తంభములు నిత్యమూ భగవంతుని సన్నిధియం దుండుటచేత కొంత కాలమునకు భగవదంశ పొందినవి.

మలయపవనము వీచినప్పుడు సర్వవృక్షములూ చందనవృక్షము లౌతవట. భక్తుల భక్తీ, భగవంతునిఅనుగ్రహమూ అనేవాయు తరంగముల నిరంతరసంఘట్టనవలన ఆ దేవాలయస్తంభములకు పూజ్యతా, మహత్తూ కలిగినవి.

౩

ఒక కాలభాగములో ఆ దేవాలయము శిథిల మైనది. శత్రురాజుల క్రోధాగ్ని ఆ పట్టణమునకు చిచ్చుపెట్టుటచేత దాని సరిహద్దులు కొద్దిగామారడ మందుకుకారణము. మానవు లాశ్రయించడం మానినతర్వాత ఆదేవాలయమును వాయువూ, వర్షమూ, పక్షులూ, మృగములూ, కీటకములూ ఆశ్రయించడం మొదలుపెట్టినవి. అవి భక్తిభావముతో ఆశ్రయించలేదని ఎవరు చెప్పగలరు?

ఆదేవునకు సూర్యుడూ, చంద్రుడూ, నక్షత్రములూ పగలూ, రాత్రీ దీపారాధనచేస్తున్నారు. వాయు వాదేవాలయమును సమ్మార్జనముచేస్తున్నాడు. వర్షము అభిషేకము చేస్తున్నది. మృగాదులు స్తోత్రవాక్యములు పల్కుతున్నారు.

ఆదేవాలయము కొన్నాళ్లకు కూలిపోయింది. శిలల బరువువల్లకాదు. దాని మహత్తు బరువువల్లనే!

కొంతకాలము గడిచింది. దేవాలయభాగములు చెదిరిపోయినవి. కొన్ని మతాంతరుల దేవాలయభాగములై భక్తుల మ్రొక్కులు పొందుతూ, పూర్వస్థితిని పొందినవి. కొన్ని మానవులయిండ్ల నాశ్రయించినవి.

కష్టబరువు మోయవలసిన బాధ్యత పోగా దేవాలయ స్తంభములుమాత్రము నిలిచి ఉన్నవి ఆకాశమునూ, నక్షత్రములనూ పరీక్షిస్తూ.

క్రమక్రమముగా అవిన్నీ ఒరిగినవి. భూమిపై పడినవి. ఎంత గాలివీచినా, ఎన్ని వానలు పడ్డా ఆదేవాలయ స్తంభములమీది భక్తుల కన్నీళ్లచారికలూ, చమురుమరకలూ మాసిపోలేదు. ఆదేవాలయ స్తంభములు తమ హృదయములో దాచుకొన్న భక్తివాసనలనూ, దివ్యమహత్తునూ కోల్పోలేదు.

ఆ దేవాలయమందలి దేవు డదృశ్యుడైనాడు. ఎప్పుడో, ఎట్లాగో!

దేవాలయ స్తంభములు క్రమక్రమముగా భూమిలోనికి దిగిపోతున్నవి. దిగిపోగా మిగిలినవి రెండుమాత్ర మింకా ఆదారిని సంచరించే మానవులకంటికి తగిలేవి.

ఇట్టి సమయమున ఆమహాపట్టణమున జైలుకట్టుటకు పూనుకొన్నారు పాలకులు. ఆనది ఆజైలును తనదగ్గిర కట్టనిచ్చిందికాదు. ఆపట్టణము తనలో ఆజైలును కట్టనిచ్చిందికాదు. పట్టణముపొలిమేరను, నదికి దూరముగా వన్యమృగములు సంచరించేతావున కట్టారు పాలకు లాజైలు.

పాలకులు జైలుకట్టినపిమ్మట పనివాండ్రు పాలకుల అనుమతిపొందకుండానే దానికి అందమును తేవలెననో, దానిక్రౌర్యమును తగ్గించవలెననో, అథవా ఆదేవాలయ స్తంభములమీది అభిమానముచేతనో వాటిని జైలు ముఖద్వారముముందు బాట కిరుప్రక్కలా పాతారు. నాటినుండి నేటివరకూ అవి అక్కడనే నిలబడిఉన్నవి, ద్వారపాలనముచేస్తూ.

౪

జైలుకట్టింది మొదలు నేటివరకూ ఎన్ని వేలమంది శిక్షితులు ఆజైలు ప్రవేశించారో! ప్రతీవాడూ ఆజైలు ముఖద్వారం — అందమైన ముఖద్వారం చూచేవాడు, కన్నీళ్లు కార్చేవాడు, భయము తన హృదయమునుండి వెలువరించిన కన్నీళ్లు. ఆదేవాలయ స్తంభములను చూచేవాడు, కన్నీళ్లు కార్చేవాడు, భక్తీ, అనునయమూ తనహృదయము

నుండి వెలువరించిన కన్నీళ్లు. ఒక దేవాలయ స్తంభమునకు జేర్లాబడి ఆకన్నీళ్లూ ఈకన్నీళ్లూ ఆ స్తంభమునకు తుడిచేవాడు. తలవంచి స్తంభమిచ్చిన అభయప్రదానము హృదయమునుండి ఎగిరిపోకుండా గట్టిగా దానిపై హత్తుకొని జైలుగర్భము ప్రవేశించేవాడు. జైలుకట్టింది మొదలు నేటివరకూ ఎన్ని వేల మంది ఆ జైలునుండి వెలువడ్డారో. ప్రతీవాడూ ఆజైలుద్వారం చూడకుండా తలవంచుకు బయటికి వచ్చి దేవాలయ స్తంభమును సమీపించి దానిని మొక్కుకొనేవాడు. అప్పుడతనికి దేవాలయప్రవేశము చేసినట్లూ, దేవతాపూజ చేస్తూన్నట్లూ ఉండేది. ఆ దేవాలయ స్తంభాన్ని కౌగలించుకొని, ముద్దుపెట్టుకొని, దాని ప్రక్కనే చాలా సేపు కూర్చుని కన్నీళ్లువిడిచి వెళ్లలేక వెళ్లలేక యింటికి వెళ్లేవాడు. ఆ కన్నీళ్లనున్నూ ఆ దేవాలయ స్తంభములు భరించేవి.

కాలము మారింది.

అన్యాయము, అసత్యము, దుర్మార్గము మాత్రమే జైలులో ఆశ్రయముపొందడానికి రావడంలేదు. న్యాయమున్నూ, అహింసయున్నూ, ఆవేశమున్నూ, భక్తిన్నీ, సత్యమున్నూ కూడా జైలుఆశ్రయాన్ని సంపాదించుకొంటున్నవి. ఇట్లా ప్రవేశించే సత్యాదులకు శిక్షితులకువలెనే దేవాలయ స్తంభములు స్వాగతమన్నవి. వారికీ అనునయమిచ్చినవి. వారికీ స్థైర్యమిచ్చినవి.

౩

ఒకనాడు అరుణోదయమయింది. సూర్యుని ఎర్రనికిరణాలు ఒక దేవాలయ స్తంభాన్ని కప్పినవి. పూర్వపుమహత్తుతో ప్రజ్వరిల్లే ఆ స్తంభమునకు నూతన తేజస్సు వచ్చినట్లయింది. రక్తసిక్తమైన దేహముతో ఒక శిక్షితుడు జైలుముఖము ప్రవేశించపోతూ దేవాలయ స్తంభములను చూచాడు. ఆగాడు. ఒక స్తంభాన్ని సమీపించాడు. కర్రదెబ్బలచేత చితికి నెత్తురుకారుతూఉన్న తన దేహాన్ని ఆ స్తంభాని కానించాడు. ఆ నెత్తురు ఆ స్తంభాని కంటుకొన్నది. సూర్యుని ఎర్రని కిరణాలలో ఆ నెత్తురు మరీ ఎర్రగా ప్రకాశించింది. ఆ స్తంభము పులకించింది.

ఈశిక్షితు డొకభక్తుడు. అహింసావ్రతము పూనినవాడు. స్వేచ్ఛాదేవత నుపాసించినవాడు. దేహమూ, ఆత్మా సర్వమూ ఆ దేవత కర్పించినవాడు. తల్లిదండ్రుల ఉపదేశవాక్యము లతని చెవినిపడి బయటికి వచ్చివేసినవే కాని హృదయముదాకా వెళ్లలేకపోయినవి, అక్కడ స్వేచ్ఛాదేవత కాపురమున్నది కాబట్టి. ప్రాణసంశయస్థితిలోనున్న ఆతని ఏకపుత్రుడుకూడా ఆహృదయంలోకి ప్రవేశించలేకపోయాడు. స్వేచ్ఛాదేవత అంత కఠిన మనస్కురాలు. కన్నీళ్లతో తడిసిన ఆతని భార్యముఖమునకుకూడా ఆతని హృదయమును తాకేశక్తి తప్పిపోయింది, హృదయమునంతా ఆ దేవతే ఆక్రమించి ఏలుతున్నది కాబట్టి.........

ఆ దేవత అతని దేహముపై ప్రహారముల పెట్టించినది. నెత్తురు ప్రవాహములు కట్టించినది. జైలుకు పంపించినది.

ఆశిక్షితుడు ఒక్కక్షణమే ఆ దేవాలయ స్తంభము నానుకొన్నాడు. అప్పుడే అతనిహృదయములో పరిణామము కలిగింది. స్వేచ్ఛాదేవతే పరిణతమైనది. ఈ దేవత ఒంటెత్తుగుణమును విడిచింది. విశాలమైనది. సర్వమునూ తనలో ఇముడ్చుకొన మొదలుపెట్టింది. అతని తల్లిదండ్రుల ఉపదేశ వచనములు హృదయమును ప్రవేశించినవి. సుతుడు స్మృతిపథమున పడ్డాడు. నిజసతిముఖము హృదయమందు ప్రతిబింబించింది. స్వేచ్ఛారాధనములో మానవారాధన మున్నది. మానవులలో తనవారున్నూ ఉన్నారు. భగవదారాధనము మూర్తీభవించినట్లున్న దేవాలయ స్తంభము ఆతనిమనస్సుకు శాంతమలవరించి జైలులో దిగబెట్టింది.

ఆనాటి రాత్రివేళ మనుష్యసంచారము లేని జైలుప్రాంతములందు ఆతనిభార్య సంచరించడం మొదలుపెట్టింది. తన కేకపుత్రుడు లేనివాడైనాడు. తన హృదయాధినాథుణ్ణి స్వేచ్ఛాదేవత ఎత్తుకుపోయింది. అతనిని వెతుక్కొంటూ వచ్చింది. జైలుముఖముచూచింది. అందమైన ఆ జైలుముఖము ఆమెను భయపెట్టింది. వెనక్కితగ్గి ఆఊరు మహానదిప్రాపు పొందడానికి నడిచినడిచివెళ్లింది. ఆనది ఆమెను చూచి ఆశీర్వదించి వెనక్కి పంపివేసింది. విశాలమైన నదీగర్భములో తనకు కాపురముండడానికి చోటు దొరకనందుకు వగస్తూ మళ్లీ జైలుముఖముదగ్గిరికి వచ్చింది. అప్పుడామె దృష్టిపథమున పడిం దాదేవాలయస్తంభం. భయము పోయింది. ఆదేవాలయ స్తంభాన్ని ఆమె సమీపించింది. ఆ స్తంభము తనలో రేపిన తుపాను ఆపుకోలేక దానికి బలి కాకోరింది. కాని అంతటి మద్యృవైన కబళాన్ని గ్రసించడానికి అది జైలుముఖముకాదు. దేవాలయస్తంభం మృత్యువును ప్రసాదించేది కాదు. శాంతజీవనమును ప్రసాదించేది. ఆ స్తంభమునానుకొని ఆమెకూర్చున్నది. తాను బలిఅగుటకుబదులు తన దౌర్బల్యమునూ, భయమునూ, నిరాశనూ బలియిచ్చింది. శాంతమామెహృదయములో ప్రవేశించింది. తన హృదయాధినాథుణ్ణి ఎత్తుకుపోయిన స్వేచ్ఛాదేవత మళ్లీ తనహృదయమందే అతణ్ణి ప్రతిష్ఠించింది. దేవాలయస్తంభము తనలో చల్లిన భక్తిబీజములను పదిలపరుచుకొని ఆమె యింటిదారి పట్టింది.

స్వేచ్ఛాదేవతను భగవద్భక్తిగా మార్చి ఆ దేవాలయస్తంభము ఆదంపతులను కాపాడింది. ఆ జైలుకెదురుగా అది ఉండి ఇంకా ఎందరినో కాపాడుతోంది.

ఆ జైలుకెదురుగా ఉన్న ఆ దేవాలయస్తంభమున కంతమహత్తు ఉన్నదని ఆదారేపోయే వాళ్లకు తెలియదు. తెలిసినవారి కామహత్తు ఎలాగ వచ్చిందో తెలియదు.

చూచేవారి కా దేవాలయస్తంభము నేడున్నూ అక్కడ ఏమీఎరగనట్లునిలబడిఉన్నది.